# వసంతపంచమి పిలుపు

మార్చి 1981 వసంతపంచమి

**బ్రహ్మవర్చస్‌శోదక్ సంస్థాన్ ఉద్ఘాటనా సమారోహము**

## వేదమూర్తి తపోనిష్ఠ యుగద్రష్ట

## పండిత శ్రీరామశర్మ ఆచార్య



వసంతపంచమి పిలుపు



పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్య తమ అమృతవాణిని ఇలా వినిపిస్తున్నారు. నేను ఏ పని మీద ఈ భూమి మీదకు వచ్చానో ఆ పని పూర్తైనది, కనుక ప్రయాణానికి సిద్ధముగా వున్నాను. అనేక ప్రదేశాలలో యీ విచారక్రాంతిని అనేకమందికి అందించాలి., దీనికొఱకు నాకు బదలీ ఆదేశములు సిద్ధముగా వున్నాయి.

## పరిజనులను పిలిపించిన ఉద్దేశ్యము

మా 55 సంవత్సరముల జీవితానుభవ సారాంశాన్ని మీకు వివరించుటకు పిలిచాను. తెలివైన మానవుడు సాహసముతో, జీవితపు విలువలను గ్రహించి భగవానుని తమ జీవితములో కలుపుకోవాలి. మొదట మీరు మీ జీవితపు విలువలను తెలుసుకోవాలి. ఈనాటి సమాజములో అధిక సంఖ్యాకులు తమను తాము దరిద్రులుగా, దుఃఖితులుగా, అభాగ్యులుగా భావిస్తూ సమస్యలవలయంలో చిక్కుకొని ఆత్మహత్యలకు సిద్ధమవుతున్నారు. ముందు ఇటువంటి వారి ఆలోచనలో మార్పు తేవాలి. జీవితపు విలువలు అర్థము చేసుకున్నవారి కళ్ళు వెలుగుతూ వుంటాయి. వారు సింహాము వలె నిలబడతారు. ధైర్యముగా ముందుకు సాగుతారు. జీవితాలు మారటానికి ఒకే ఒక్క క్షణము చాలు. ఒక ఆమ్రపాలి, అంగుళీమాలుడు, అజామీళుడు, బిల్వమంగళుడు మొదలైనవారంతా తమ జీవితపు దిశలను మార్చుకొని సమాజ శ్రేయస్సుకు పాటుపడి చరిత్రలో ధన్యులుగా నిలిచారు.




*గురుదేవులు చెప్పిన లక్ష్యమును ఒక కాగితం మీద వ్రాసి పెట్టుకోండి. దాన్ని ప్రతిదినము దానిని గమనిస్తూ వుంటే మీకు ఆ లక్ష్యమును పూర్తిచేయాలన్న స్ఫూర్తి కలుగుతుంది.*





ఇంటియందు పూజలు, జపాలు చేసినంత మాత్రాన భగవంతుడు ప్రసన్నుడు కాడు. భగవంతునితో సంబంధము యేర్పడదు. సంబంధాన్ని స్థాపించుకోవటానికి రామకృష్ణపరమహంస - వివేకానందులు, చాణక్య - చంద్రగుప్తులు, సమర్థగురురామదాసు - శివాజీల వలె జీవించాలి.

ఇండోరు మహారాణి అహల్యాబాయి జీవిత చరిత్ర మనము తప్పక తెలుసుకోవాలి.

ఇండోరు మహారాజు తుకోజీరావు ఒకసారి వేటకు వెళ్ళాడు. వేట సమయములో గాయపడిన చిఱుతపులి పొదలో దూరింది. గాయపడిన జంతువు అదనుచూచి మీదపడి ప్రతీకారము తీర్చుకుంటుంది. అందుచేత రాజు దానికొరకు గుఱ్ఱము మీద చుట్టూ పొలాలలో తిరుగుతున్నాడు. ఆ తిరగటం వలన అచ్చటి పంటపొలము అంతా ధ్వంసమౌతున్నది. ఆ దృశ్యాన్ని చూచిన 19 సంవత్సరముల రైతు కుమార్తె రాజు ముందుకు వచ్చి నిలబడి 'నీ గుఱ్ఱపు పరుగుతో మా పొలాన్ని, పొలములోని పంటను ధ్వంసము చేస్తూ ఎందుకు తిరుగుతున్నావు? అని అడిగింది. దానికి ఆ రాజు గాయపడిన చిరుతపులి విషయము తెలిపెను. అందులకు ఆ బాలిక పొదలోనికి పోయి చిఱుతను పట్టుకో అని చెప్పెను. కానీ రాజు భయమువలన పొదలోనికి వెళ్ళలేదు. వెంటనే ఆ బాలిక ఒక మంచి కఱ్ఱను తీసుకుని పొదలోనికి వెళ్ళి దాగియున్న ఆ చిఱుతను బాగుగా చితక్కొట్టి తెచ్చి రాజు ముందు పడవేసింది. వెంటనే రాజు ఆ బాలికతో వారింటికివెళ్ళి ఆమె తండ్రికి నమస్కరించి తనను పరిచయము చేసుకొని యీ బాలికను తనకిచ్చి వివాహము చేయమని అడిగెను.

వివాహము జరిగిన తరువాత అక్షరజ్ఞానమే లేని ఆ రైతుబిడ్డ సమస్త విద్యలనూ నేర్చుకుని తానే రాజ్యపాలనను చేసినది. చరిత్ర యీామె పాలనను విశేషముగా కొనియాడింది. తనకోసము కాకుండా యితఋలకొఱకు ఆలోచించినప్పుడు మాత్రమే భగవంతునితో సంబంధము యేర్పడుతుంది. భౌతికంగా ఒక పని జరగాలంటే యెంతో శ్రమను, ధనాన్ని సమయాన్ని వెచ్చించాలి. అలాంటిది భగవంతునితో సంబంధము స్థాపించుకోవాలంటే యెంత శ్రమించాలి? జపాలు, పూజలు, అనుష్ఠానాలు చాలవు. భగవద్భక్తుల, బ్రాహ్మణుల, ఋషుల చరిత్రలను అధ్యయనము చేస్తే యీ విషయము మనకు వివరంగా అర్థమౌతుంది. వారు జపతపాలు చేస్తూ, ఈ విశ్వ ఉద్యానవనాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దటానికి ప్రపంచమంతటా పర్యటిస్తూ నిరంతరము శ్రమించేవారు. రాముని ప్రియశిష్యుడు హనుమంతుడు 'రామ్ కాజ్ కిన్హే బినా మొహితహా విశ్రామ్" అన్నాడు. అనగా రామనామము జపించటమే కాదు రాముని పని కూడా చెయ్యాలి. కృష్ణుని ప్రధాన శిష్యుడు అర్జునుడు కూడా తన జీవితమును కృష్ణుని పనిచెయ్యటానికే వినియోగించెను.



విద్య యొక్క లక్ష్యము ఆత్మవిశ్వాసమును, చిత్తశుద్ధిని, పూర్ణహృదయమును సాధించుట. ఉత్తమశీలము, సద్బలము, పరోపకారము వికసించే వ్యక్తిత్వము పొందుట. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విలువల సమ్మిళిత తత్త్వమే నిజమైన విద్య.





*మిత్రులారా! నేడు మరలా సమయ మాసన్నమైనది. మహాకాలుడు ప్రాణశక్తి గలిగిన ఆత్మలకు విశేషంగా పిలుపు నిచ్చాడు. ఇది మాకుమాత్రమే తెలుసు. మీకు తెలియదు. ఇందుకొఱకు మీ అందఱికీ ఉత్తరములు వ్రాసి పిలిపించాను. మా గురుదేవులు 55 సంవత్సరముల క్రిందట మమ్మల్ని మేలుకొలిపి మాకు మార్గదర్శనము చేసినారు. అదేవిధముగా మేము యీనాడు మీకందఱికి మార్గదర్శనము చేస్తాము.*

ఆధ్యాత్మికవిద్య ఆచరించకుండా మానవుని నైతిక అవసరాలు పూర్తికావు. ఈనాటి అస్తవ్యస్థ పరిస్థితులు కారణముగా మానవుడు గాభరాపడుతూ చిక్కుసమస్యలలో మునిగి సతమతమౌతున్నాడు. ఈ మానవుల బాధను చూసి రాత్రింబవళ్ళు మా మనస్సు అశాంతితో క్షోభిస్తున్నది. ప్రపంచమందు మా బిడ్డలు మానసిక, శారీరక, కుటుంబ సమస్యలతో యెంతగా క్షోభిస్తున్నారో మాకు తెల్సు. ఇండ్లయందలి క్లేశాలు, స్త్రీ-పురుషుల మధ్య భయంకరమైన యుద్ధాలు, రాజకీయ సామాజిక సమస్యలు యివన్నీ మానవుల వికృతమైన మనస్సు కారణముగా యేర్పడుచున్నవి. ఈ పరిస్థితులలో ముందు వ్యక్తిని సరిచేయగలిగినది ఆధ్యాత్మికశక్తి మాత్రమే. ఈ శక్తిని ప్రాణవంతముగా వుంచేందుకు మనమంతా కలిసి ప్రయత్నము చేయాలి. మహాకాలుడు దిగజాఋతున్న మానవజాతి భవిష్యత్తును సరిచేయటానికి చక్కదిద్దటానికి పిలుపునిచ్చారు. మనలోని ప్రతివొక్కరూ దానికొఱకు ప్రయత్నించినప్పుడే యీ ఆధ్యాత్మికత జీవిస్తుంది.

ఈ ఆధ్యాత్మిక శిక్షణ యెలా యివ్వాలి? దీనిని యెలా ముందుకు తీసుకెళ్ళాలి?

ఇది మాటలతో చెప్పే విషయము కాదు. అలా చెప్పగలిగినచో అనేకమంది పండితులు పురాణ ప్రవచనాలు చేస్తూనేవున్నారు. జ్ఞానులకూ, ప్రతిభావంతులకూ లోటులేదు. వారందఱూ తమ ప్రతిభతో అందఱికి ఆధ్యాత్మికతను అందించగలిగినట్లైతే యెప్పుడో యీ ప్రపంచము యెంతో సుందరముగా వుండేది. కానీ యీ ఆధ్యాత్మికత వారి వశములో లేదు. ఈనాడు మనమంతా కలిసి ఆధ్యాత్మికతను వ్యాప్తి చెయ్యాలి. దీనికొఱకు మనము మన వ్యక్తిగత జీవితాలను చక్కదిద్దుకోవాలి. వెలుగుతున్న దీపము మాత్రమే మఱొక దీపాన్ని వెలిగిస్తుంది. ముందు మనలో వెలుగును నింపుకోవాలి.

***<u>మహాకాలుడు ఈనాడు మిమ్మల్ని పిలుస్తున్నాడు. మీరు ఒక విశేషమైన వ్యక్తి. ఇది విశేషమైన సమయము. మీమీద ఒక విశేషమైన బాధ్యత వున్నది.</u>***

మన వీధిలో ఇళ్ళు తగలబడుతుంటే యేవిధముగా మనము తిండీతిప్పలూ మానేసి పూజలూ, భజనలూ మానేసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తామో అదేవిధముగా యీనాడు మహాకాలుని పిలుపు విన్న వెంటనే పనిలోకి దిగాలి. ఇది యుగసంధ్యాసమయము. ఈనాడు జాగృతాత్మలలో స్పందనలు అధికముగా కలిగించబడినవి. ఈ కాలాన్ని గుర్తించనివారు, దీని ప్రాధాన్యతను గ్రహించనివారు తరువాత పశ్చాత్తాపడవలసి వుంటుంది.





మిత్రులారా! గాంధీగారు స్వరాజ్య ఉద్యమము నడిపినప్పుడు జాగృతాత్మలు సత్యాగ్రహము అనే పేరుతో వారితో కలిసి పనిచేశాయి. ఆ సమయాన చుట్టుప్రక్కలవారు వారిని పిచ్చివారిగా భావించి అవహేళన చేశారు. కానీ ఆ పిచ్చి యే స్థాయికి యెదిగిందో చరిత్ర చెప్పింది. పటేలు ఒక చిన్న వకీలు. ఆయన తరువాత గృహమంత్రిగా నియమించబడ్డారు. నెహ్రూ ప్రధానమంత్రి అయ్యారు. మహాకాలుని పిలుపుకు స్పందించనివారు దుఃఖించారు. ఇలాంటి అవకాశము మళ్ళీ జీవితములో రాకపోవచ్చు. సాహసము గలవారు ముందుకు వచ్చి పనిలో దిగాలి. 55 సంవత్సరముల క్రిందట మా గురువుగారు మా వద్దకు వచ్చారు. వారి ఆదేశాన్ని నేను తు.చ తప్పకుండా ఆచరించాను. మీరు నాలాగే వివేకము కలిగి వుండాలని కోరుతున్నాను. రాబోయేరోజులలో విద్యుఛ్ఛక్తి, అణుశక్తి, ధనశక్తి, మానవుని తెలివితేటలు వెనుకపడతాయి. ఆత్మికశక్తి మాత్రమే దేశాన్ని స్వర్గముగా తయారుచేయగలదు. అది తిరిగి అంతటా వ్యాపించనున్నది.

## <u>ప్రాణశక్తి గల ఆధ్యాత్మికత</u>

ఈనాడు ఆధ్యాత్మికత ఒక శవము లాగా తయారయ్యింది. జపమాల త్రిప్పటము, ప్రాణాయామము చెయ్యటము ఆధ్యాత్మికత కాదు. ఆధ్యాత్మికత అంటే సిద్ధాంతాలు, ఆదర్శాలు, ధైర్యసాహసాలు, జీవితములో శ్రేష్ఠతను అలవరుచుకొనుట.




**హరిద్వార్‌లో మేము స్థాపించిన బ్రహ్మవర్చస్ నందు ఆధ్యాత్మికత యొక్క స్వరూపాన్ని బోధిస్తాము. జీవితములో దీనిని ప్రయోగించుకునే విద్యను నేర్పుతాము.**

రామాయణము చదివితే ముక్తి వస్తుంది. జపము చేస్తే చాలు అనే మూర్ఖతను వదలండి. రామాయణంలోని ప్రాణశక్తిని హనుమంతుడు, తులసీదాసు త్రాగారు. రామనామాన్ని వాళ్ళు వాళ్ళ జీవితాలలో ఉపయోగించుకున్నారు. బ్రహ్మవర్చస్‌ను స్థాపించింది ఆధ్మాత్మ స్వరూపాన్ని సిద్ధాంతాలను, ఆదర్శాన్ని సామాన్య ప్రజలందఱికీ వివరించటానికే. మేము రామాయణాన్ని, జపమాలను నిందించటము లేదు. జపము వెనుక, ఉపాసన వెనుక ప్రాణశక్తి వుండాలి. అది లేనప్పుడు అవి శవప్రాయముగానే వుంటాయి. దేవాలయా లన్నీకూడా జనజాగృతి కేంద్రాలుగా మారాలి. అక్కడ భగవంతునితో పాటు జ్ఞానానికి, ఆలోచనకూ, లోకహితానికీ కూడా ప్రాముఖ్యత వుండాలి.





## నూతన యుగానికి నూతన జ్ఞానమందిరాలు



**ఈ పనికొఱకే బ్రహ్మవర్చస నిర్మాణము జరిగింది. దేవాలయముతో పాటు విద్యాలయము, గ్రంథాలయము, వయోజన విద్యాలయము, వైద్యాలయము కూడా వుండి తీరాలి. ఇదే ఈనాటి నూతన మందిర స్వరూపము. ఇటువంటి మందిరాలను యేర్పాటు చెయ్యాలని మా కోరిక.**

ముందు ఇంటిని దేవమందిరముగా మలచుకోవాలి. ఆస్థికత యీనాడు చాలా అవసరమైనది. ముందు మీ ఇంట్లో మీరు జపము చెయ్యండి. కుటుంబసభ్యుల చేత చేయించండి. మీ ఇంటి నుండే ప్రచార కార్యక్రమము ప్రారంభించండి. ఇంట్లో ఒక భగవానుని చిత్రపటాన్ని స్థాపించండి. 5 నిమిషాలు జపము, 5 నిమిషాలు సవితా ధ్యానము చేయమని ఇంటిలోని వారిని కోరండి. వారు వినరు. కనీసము భోజనము చేసే ముందు విధిగా నమస్కరించే అలవాటు చెయ్యండి. పూజావేదిక మీద కలశాన్ని వుంచండి. దానిని చక్కగా అలంకరించడి. పిల్లలు దాని గురించి ప్రశ్నిస్తారు. మీరు దానిని వివరించి వారిలో జిజ్ఞాసను పెంచండి.

# గాయత్రీ - మాత, యజ్ఞ - పిత

మన భారతీయ సంస్కృతి గాయత్రిని తల్లిగానూ, యజ్ఞాన్ని తండ్రిగానూ బోధిస్తుంది. అందుచేత ప్రతి ఇంటా యీ రెండూ తప్పనిసరిగా వుండాలి. ఆస్తికతను వ్యాప్తి చేయటానికి యిది యెంతో సహకరిస్తుంది.

ఇంట్లో నిత్యమూ గాయత్రీ జపము జరగాలి, యజ్ఞపరంపరను వ్యాపింప చేయటానికి 5 ఆహుతులను ప్రతిరోజూ అగ్నికి సమర్పించాలి. ఆస్థికత అనునది ప్రతి వ్యక్తిలోని నిష్ఠకు సంబంధించినది. మహిళలు యజ్ఞపరంపరనూ, మంత్రజపాన్ని అన్నిచోట్ల వ్యాపింపచేయగలరు. పిల్లలకు పాలతోపాటు మంత్రభావము యొక్క శ్రేష్ఠతను అందిస్తారు. వంట చేసే సమయములో మంత్రము చేయటము వలన వండిన ఆహారము సంస్కారవంతముగా తయారవుతుంది. ఇలా వండిన ఆహారము భుజించినందువలన సద్బుద్ధి కలిగి మంచి ఆలోచనలు వస్తాయి. ఈ యజ్ఞపరంపను మా వలెనే మీరు కూడా వ్యాప్తి చేయండి. మీ ఇండ్ల యందు గాయత్రిమాతకు చోటివ్వండి. యజ్ఞపరంపరను ప్రారంభించండి. ఒకదాని చమత్కారాలు చూడండి. మీరు ప్రారంభిస్తే మీ పిల్లలు మీ మార్గాన్నే అనుసరిస్తారు. ఇంటి వాతావరణములో ఆస్తికత యేర్పడుతుంది.





# దేవస్థాపనలు

ఇండ్ల యందు, పరివార్ శాఖల యందు యీ దేవస్థాపనలు తప్పనిసరిగా వుండాలి. చిన్నచిన్న ఫొటోలకు ప్రాణప్రతిష్ఠ చేసి ఇంటింటికీ అందించండి. ఇండ్లను దేవాలయాలుగా మార్చండి. మా గురుదేవుల ఆదేశానుసారముగా మేము యీ విషయాన్ని లక్షలాదిమందికి అందించాము. మీరు కూడా దీనిని మా వలెనే విస్తరింపచేయండి. ఇది మా మొదటి ఆందోళన.

మా రెండవ ఆందోళన విచారక్రాంతి అనగా ఆలోచనలయందు విప్లవము.



**ఏ సంస్థలో నైనా వ్యక్తులు ఆదర్శాలకు అతుక్కోవాలి తప్ప వ్యక్తికి కాదు.**

మానవుని ఆలోచనలయందే సమస్తమూ కలదు. దొంగగా జీవించిననూ, సాధువుగా మారిననూ, ఋషిగా జీవించినా అది యీ ఆలోచనల ప్రభావమే. అగ్ని అనగా ఆలోచనలు. మా గురుదేవు లందించిన అగ్నిని మేము వ్యాప్తి చేశాము. మీ పని కూడా యిదే. దీనికి సంకేతముగా "ఎట్టకాగడా" ని యేర్పాటుచేశాము. ఇదే జ్ఞానజ్యోతి. నూతన యుగము జ్ఞానము ద్వారానే వస్తుంది. ఆలోచనల ద్వారానే వస్తుంది. ఆయుధాలతో రానే రాదు. మహాకాలుని చేతుల్లో వెలుగుతున్న కాగడా పెట్టబడివుంది. దానికి వెనకాల ఒక పెద్ద మానవ సమూహము వున్నది. ఆ వెలుగునూ, జ్ఞానాన్ని పుస్తకముల ద్వారా అందరికీ పంచి పెట్టుతున్నాము.జ్ఞానరథ పథకాన్ని, ఝోలా పుస్తకాలయాన్ని యేర్పాటు చేశాము. ఈ పుస్తకాలను అందరిచేతా చదివించాలి. జగన్నాథుని రథము వలె యీ జ్ఞానరథము వీథివీథికీ నడవాలి. భగవానుని వద్దకు అందరూ వెళ్ళలేరు. అందుచేత భగవానుని, అనగా జ్ఞానాన్ని, ఋతుంభరాప్రజ్ఞనూ, గాయత్రీమాతనూ మీరే ఇంటింటికీ తీసుకెళ్ళాలి.

## సమయదానము

సమయదానమే
నేటి
యుగధర్మము.







మీరు భగవానునితో భాగస్వాములు కావాలనుకుంటే కొంత సమయాన్ని భగవంతునికి సమర్పించండి. అంతేకానీ గురునామము చెయ్యటము, గురువుకు నమస్కరించటము, పాదపూజలూ, ఆరతులూ లాంటి పనులు చేయకండి. ఈ సమయాన్ని మీ మార్గాన్ని శుభ్రము చేసేందుకు వినియోగించండి. కాలువలు శుభ్రము చేయండి. కాలువల్లో చెత్తను మాత్రము వేయవద్దు. మిత్రులారా! ఈనాడు చేయవలసిన గొప్ప సేవ ప్రజల మనస్సుల యందు యుగచేతనను నింపుట. దీనికి ఝోలా పుస్తకాలయము బాగా వుపకరిస్తుంది.

సుల్తాన్‌పూర్‌లోని వకీలు లఖపతిరాయ్‌గారిని నేను మరువలేను. ఆ గ్రామములో మొదటిసారి నేను పంచకుండీ యజ్ఞమునకు వెళ్ళినప్పుడు ఒక 100 మంది మాత్రమే అందులో పాల్గొనిరి. కానీ వకీలుగారు ఝోలా పుస్తకాలు ద్వారా ఆ ఊర్లోనే కాక, చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా యీ జ్ఞానాన్ని అందించారు. ఆ జ్ఞాన యజ్ఞ ఫలితంగా ఇంకొకసారి సుల్తాన్‌పూర్‌లో యజ్ఞము జరిగినప్పుడు లక్షమందికి పైగా తరలివచ్చారు. ఖర్చుకూడా వారే భరించారు. ఖర్చుకుపోగా మిగిలిన 51 వేల రూపాయలు గాయత్రీ తపోభూమికి సమర్పించారు. మేము మా గురువుతో భాగస్వామ్యము వల్ల అనంతమైన సంపదను పొందాము. మీరూ భాగస్వాములు కాదలిస్తే విశ్వాసముతో పనిచేయండి. లాభాలు పొందండి.

## నిజమైన భజన

భజన అంటే గురువుగారి పనిచేయడమే. విచారక్రాంతి అనే అగ్నిని విశ్వమంతా వ్యాపింపచేయండి. మా హృదయములో మండుతున్న మా గురు అగ్నిని సమాజ మంతా వ్యాపింపచేయండి. ప్రతివారికీ యీ జ్ఞానయజ్ఞపు వెలుగు అందితీరాలి.

## యుగచేతన - వెలుగు



ఈ వెలుగు ప్రపంచమంతటా నిండాలి. మిత్రులారా!!!! మిమ్మల్ని ప్రదక్షిణలు చెయ్యడానికి, యజ్ఞాలు చెయ్యటానికి పిలవ లేదు. మీకు కొంత ఇవ్వాలనుకుంటున్నాను. దానికి బదులుగా మీరు మాకు కొంత సమయాన్ని ఇవ్వండి. భాగస్వామ్యము అనేది విశ్వాసము మీదనే ఆధారపడివుంటుంది. మిత్రులారా! విశ్వాసము అనగానే నాకు అమెరికాలోని థామస్ అనే వ్యక్తి గుర్తుకొస్తాడు. అతడు ఆ విశ్వాసముతోనే నయాగరా జలపాతాన్ని నాలుగుఫర్లాంగుల దూరాన్ని ఆ చివరా, ఈ చివరా తాళ్ళుకట్టి దాటేవాడు. అది చూసి అందరూ చప్పట్లు చరిచేవారు. మీకు కూడా నాపట్ల, భగవంతునిపట్ల విశ్వాసముంటే నా భుజాలమీద కూర్చోండి. మిమ్మల్ని కూడా





యీ జలపాతము దాటిస్తాను అన్నాడు. కానీ యెవ్వరూ ముందుకెళ్ళలేదు. కానీ అతని 11 సంవత్సరముల పిల్లవాడు అతని భుజములపై కెక్కాడు. తరువాత ఆ పిల్లవాడిని నీకు పడిపోతావని భయము లేదా? అని ప్రశ్నించగా మా తండ్రి పడేవఁకూ నేను పడనుగా! అన్నాడు. అదీ విశ్వాస మంటే. నమ్మకమూ యిదే.

మేము భగవానుని విశ్వసించాము. దాని ఫలితముగా మాకు అనంతమైన సంపద లభించింది. అదంతా మీకు యెదురుగానే కనిపిస్తోంది. మీరూ విశ్వసించండి. భాగస్వాములు కండి. మీ జీవితాన్ని ధన్యము చేసుకోండి.



**ప్రజ్ఞాపురాణమును**
**ఇంటింటికి అందజేయండి**

*ఓం శాంతిః శాంతిః శాంతిః*